క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి



కొల్లిపర: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టేలా అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం ఆర్.జె.కృష్ణారావు చెప్పారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో కొల్లిపర పంచాయతీ పరిధిలోని 1,2,3 సచివాలయం సిబ్బందికి జగనన్న గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల వద్దకు అధికారులు వెళ్లి జగనన్న కాలనీల్లో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి వివరించి వారికి ఉన్న అపోహలు తొలిగించి 100శాతం గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి భార్గవ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ తెనాలి ఆధ్వర్యంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న పేద రజక విద్యార్థులకు త్వరలో ఉపకార వేతనాలు, డ్రస్ మెటీరియల్స్, స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేయనున్నట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతర్లంక ప్రసాద్, పేటేటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ పేరు, తండ్రి పేరు, పాఠశాల పేరు, సెల్‌నంబరు, హాల్ టికెట్ నంబర్లను తమకు తెలియజేయాలని కోరారు. వివరాలు అందజేసిన వారికి వీటిని పంపిణీ చేస్తామని చెప్పారు. పేద రజక విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

పాఠశాలలకు 2,740 గ్లాసులు



కొల్లిపర: జగనన్న గోరుముద్దలో భాగంలో విద్యార్థులకు రాగి జావ అందించేందుకు ప్రభుత్వం పాఠశాలలకు బుధవారం 2,740 స్టీల్ గ్లాసులు పంపించిందని, వాటిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశామని ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ వి.ఉషారాణి, అకౌంటెంట్ కె.నాగమల్లేశ్వరి, సీఆర్‌పీ వి.మురళి, కార్యాలయం అటెండరు కె.మాణిక్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేడియో ఆర్టిస్ట్ సత్యనారాయణకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం మాయాబజార్ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం సింహబలుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ రేడియో ఆరిస్ట్ అన్నిశెట్టి సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో ఖగ్గా గోపి, దాసరి సాంబశివరావు, బి మల్లేష్, తాడిపర్తి మహేష్, గంగా మణికంత, కాటం రవి కుమార్, సిహెచ్ శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో చోరీకి విఫలయత్నం

తెనాలిరూరల్: పైపుల దుకాణల్లో దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. స్థానిక మోరిస్‌పేటలోని గుర్రాల సందులో ఉన్న పైపులు, హార్డ్‌వేర్ దుకాణాల్లో మూడు దుకాణాల తలుపులకు ఉన్న గొళ్లాలను మంగళవారం అర్ధరాత్రి దాటాక తొలగించారు. తలుపులకు లోపలివైపున వేసి ఉన్న గడియలను తెరువలేకపోయారు. దుకాణాల తలుపులకు అడ్డంగా పెట్టి ఉన్న ఇనుప బద్దీలనూ తీయలేకపోయారు. చోరీకి యత్నించే ముందు అక్కడ ఉన్న సీసీ కెమెరాలనూ ఆకాశం వైపు చూసేలా తిప్పారు. బుధవారం ఉదయం దుకాణాలకు వచ్చిన యజమానులు చోరీ యత్నం జరిగిందని గ్రహించారు. దుండగులు చోరీకి యత్నించి విఫలమయ్యారని గుర్తించి ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు.

మహిళ మార్టుపై అసత్య ప్రచారం

ఫిరంగిపురం: మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన చేయూత మహిళమార్టు విషయంలో అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ఏపీఎం సుజాత అన్నారు. మండల సమాఖ్య సమావేశం బుధవారం నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ చేయూత మహిళ మార్టులో సరుకులు కొనుగోలు చేసి రశీదు చూపిస్తేనే మూడో విడత ఆసరా నగదు వేస్తారని వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ఈనెల మూడో తేదీ నుంచి సంఘ తీర్మానం రాయించుకొని మీ సంఘం ఖాతా నుంచి వ్యక్తిగత ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు.

జన హృదయాల్లో జగన్ స్థానం పదిలం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 25వ వార్డులో ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 25వ వార్డు పినపాడులోని సచివాలయం నుంచి బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ఆధ్వర్యంలో వార్డు నాయకులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్ళిన ఎమ్మెల్యే ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ మంచి కార్యక్రమమని, ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు చక్కని వేదికని అభివర్ణించారు. ప్రజలు ఈ కార్యక్రమానికి బ్రహ్మరథం పడుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. స్వచ్ఛందంగా తమ ఇళ్లకు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అంటించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణాలనూ ఆదుకుంటోందని చెప్పారు. 25వ వార్డులో ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ద్వారా రూ.13.90 కోట్ల మేర ప్రయోజనం కల్పించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, రాష్ట్ర భట్టరాజుల సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్ళబండి సుష్మ, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, తోట రఘురామ్, కుర్రా సుజాత, పెదలంక లక్ష్మీలావణ్య, ఆవుల కోటయ్య,షేక్ ఇస్మాయేల్, గొడవర్తి శ్రీసాయిహరేరామ్, మొఘల్ అహ్మద్‌బేగ్, 25వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు వై.మోహన్, షేక్ జిలాని, పఠాన్ సుభాని, పెరుగు అంజయ్య, ప్రసాద్, బాజి, కరేటి పున్నయ్య, జిలాని, నన్నె, మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న

- ఇంటింటా ఇదే నినాదం
- అట్టహాసంగా జగనన్నే మా భవిష్యత్
- నాయకులకు ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు



తెనాలి 12వ వార్డులో బుక్‌లెట్‌ను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ యశోదా, కన్వీనర్ ప్రభాకర్ తదితరులు



35వ వార్డులో బుక్‌లెట్ అందిస్తున్న కౌన్సిలర్ సాయిహరేరామ్, గృహసారథులు.



తెనాలి 34వ వార్డులో బుక్‌లెట్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సంజీవరెడ్డి

తెనాలిఅర్బన్/తెనాలి టౌన్: జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఇంటింటా జయహో జగన్ నినాదం హోరెత్తుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభిస్తోంది. తెనాలి పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో బుధవారం కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అంటించారు. 12వ వార్డులో కౌన్సిలర్ కొర్రా యశోద ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తెనాలి పట్టణ కన్వీనర్ మన్నవ ప్రభాకర్ ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలకు కలిగిన మేలుల గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు దేవరపల్లి భూషణం, అత్తోట కిషోర్, గోపి, ఇసుకపల్లి బాలమూర్తి, మోహన్ తదితరులు పాల్గొన్నారు. 34వ వార్డులో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, 35వ వార్డులో కౌన్సిలర్ గొడవర్తి శ్రీసాయిహరేరామ్, నాయకులు తాడిబోయిన పోలురాజులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించారు.

- తెనాలి రూరల్ మండలం కంచర్లపాలెం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అంటించారు. మహిళలకు కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోపల్లె మణిమ్మ, సచివాలయ కన్వీనర్‌లు పొదిలి అరుణ, కఠెవరపు శివయ్య, గృహసారథులు శ్రీను, రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు కోపల్లె సురేష్, పొదిలి శ్రీనివాసరావు, కఠెవరపు రాజేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



డీటీ కల్యాణికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నేతలు

మంగళగిరి: నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాలలో జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘ నాయకులు కోరారు. బుధవారం దుగ్గిరాలలోని తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ కల్యాణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో 3,200 ఎకరాల్లో జొన్న, 12,400 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారని, పంటలు చేతికి రాకముందు రూ.2,200 ఉన్న క్వింటాల్ మొక్కజొన్న రూ.1,800లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రూ. 2900 ఉన్న జొన్న పంట రూ.2300లకు పడిపోయిందని, వెంటనే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, జెట్టి బాలరాజు, వి.సాంబశివరావు పాల్గొన్నారు.

మునిసిన పోలేరమ్మ తిరునాళ్ల



తిరునాళ్లలో ఆకట్టుకున్న విద్యుత్‌ప్రభ

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి దేవాలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం బుధవారం తెల్లవారుజాముతో ముగిశాయి. గత మూడు రోజులుగా ఆలయంలో చండీహోమం, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు, లక్ష మల్లెలతో అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం తీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కుంకుమపూజలు, పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. ఆయా ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ



మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీడీఏ శివకుమారి

ముప్పాళ్ళ: విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడడం వల్ల, సేంద్రియ ఎరువుల వాడడం తగ్గిపోవడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని పలు రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతుభరోసా కేంద్రంలో నేల ఆరోగ్య పరిరక్షణ మరియు మట్టినమూనాల సేకరణపై గ్రామవ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శివకుమారి మాట్లాడుతూ రసాయనాల వాడకం వల్ల నేల చౌడు బారుతుందన్నారు. ఉప్పు నేలగా మారే ప్రమాదం ఉంటుందని చెప్పారు. పరిష్కారంగా భూసార పరీక్ష చేయించుకుని అవసరాన్ని బట్టి ఎరువులను వాడుకుని తద్వారా ఎరువులపై పెట్టే ఖర్చు తగ్గించుకోవాలని, సూక్ష్మపోషక లోపాలు సవరించుకుని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. మన నేలలో సేంద్రియ పదార్థాలు చాలా తక్కువగా ఉన్నాయని, పశువుల, కోళ్ళ ఎరువు, గొర్రెల మేకల మంద కట్టడం, పచ్చిరొట్ట ఎరువు వాడకం వంటివి చేపట్టాలని సూచించారు. కార్యక్రమం అనంతరం క్షేత్రస్థాయిలో మట్టినమూనాలు తీసే విధానం పై అవగాహన కల్పించారు. సమస్యాత్మక నేలలు బాగు చేయడం గురించి, జిప్సం వాడే విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ, ఆయా గ్రామాల వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో బాబూ జగ్జీవనన్‌రామ్ విగ్రహావిష్కరణ

తెనాలిఅర్బన్: భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని గురువారం తెనాలిలో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రపండు కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



తెనాలిటౌన్: స్థానిక గాంధీ నగర్‌లోని శ్రీషిరిడి సాయి వృద్ధాశ్రమంలో శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు అన్నదానం చేశారు. యోగా సభ్యులు కంబాల వెంకటనాగబాబు, రజని దంపతుల పెళ్ళిరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. కఠెవరం గ్రామ మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ సభ్యులు పెళ్ళిరోజు, పుట్టిన రోజు వేడుకలు వృద్ధుల సమక్షంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, తన్నీరు శివశంకర్, ఆశ్రమం నిర్వాహకులు సత్యనారాయణ, సుజాత పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



దేవకుమార్ కుమారుడికి నగదు అందజేస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, సీఐ చంద్రశేఖర్, సిబ్బంది

తెనాలిరూరల్: పట్టణంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి పోలీసులు ఆర్థిక సాయం చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన గొట్టిముక్కల దేవకుమార్(48) తెనాలిలో కుటుంబంతో కలిసి ఉంటూ హోంగార్డుగా ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్నాడు. గత నెల 27న గుండెపోటు రావడంతో దేవకుమార్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు.ఈ నేపథ్యంలో తెనాలి వన్‌టౌన్ సర్కిల్ సీఐ కె.చంద్రశేఖర్, సిబ్బంది దేవకుమార్ కుటుంబం కోసం రూ. 64 వేలు సమకూర్చారు. నగదును డీఎస్పీ స్రవంతిరాయ్ చేతుల మీదుగా దేవకుమార్ కుమారుడికి బుధవారం అందజేశారు.

పోషకాహారంతోనే చక్కటి ఆరోగ్యం



రాగి జావ గ్లాసుల పంపిణీలో ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలి: పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం, విద్యాభ్యాసం సాధ్యమని తెనాలి మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాలల విద్యార్థులకు రాగి జావ తాగేందుకు అవసరమైన గ్లాసుల పంపిణీని బుధవారం పట్టణ తాలూకా హైస్కూలులో ఎంఈఓ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. తెనాలి రూరల్ మండలం, పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాగి జావ తాగేందుకు మొత్తం 12,800 గ్లాసులు వచ్చాయని తెలిపారు. వీటన్నిటినీ పాఠశాలలవారీగా ఆయా ప్రధానోపాధ్యాయులకు అందించినట్టు తెలిపారు. జగనన్న గోరుముద్దలో భాగంగా గుడ్డు, చిక్కి సహా రాగి జావను వారానికి మూడురోజులు అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా జావను తాగుతున్నట్టు చెప్పారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా దాతలు ఎవరైనా ముందుకొచ్చి చల్లని మజ్జిగ కూడా పంపిణీ చేయొచ్చని సూచించారు. ఆసక్తి గల దాతలు పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని చెప్పారు. పదోతరగతి పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షల జరుగుతున్నాయని తెలిపారు. రానున్న విద్యాసంవత్సరానికి జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలలకే పంపుతామని చెబుతూ ఇప్పటికే స్టాక్ పాయింట్‌ను గుర్తించి, అధికారులతో కలిసి పరిశీలించామని చెప్పారు. జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, అమ్మ ఒడి, ట్యాబ్స్ పంపిణీ వంటి సౌకర్యాల కల్పనపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు. రానున్న ఏడాదిలో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత అధికంగా విద్యార్థుల చేరికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు చేయూత



పంపిణీ చేసిన గొడుగుతో శివశంకర్, కుమార్ తదితరులు

తెనాలిఅర్బన్: సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లో రోడ్డుపై చెప్పులు కుట్టుకునే ఏసురత్నంకు రూ.2,500 విలువ చేసే గొడుగును బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నటరాజ్ జ్యూయలరీస్ అధినేత కొత్త మాసు కుమార్, సంస్థ సభ్యులు మాలేపాటి హేమ కుమార్, పేటేటి రవి కుమార్, ముద్దాభక్తుని రమణయ్య, చుక్కా భానుప్రసాద్, అడపా సంపత్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

- నాజరుపేటకు చెందిన నిరుపేద బ్రహ్మణుడు వావిలాల మోహనరావు బుధవారం మృతిచెందాడు. అంత్యక్రియలు చేసే ఆర్థిక స్తోమత వారికి లేకపోవటంతో అతని కుటుంబ సభ్యులు సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వారిని సంప్రదించారు. వారి సహకారంతో ఆదిత్య రెస్టారెండ్ అధినేత వేముల రామకృష్ణ రూ.3,100 నగదును మృతుని కుటుంబ సభ్యులకు ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

డెప్యూటీ తహసీల్దార్ కుమార్తెకు ఉద్యోగం



అనూహ్యకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలిరూరల్: విధి నిర్వహణలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురై విధులకు హాజరుకాలేని స్థితిలో ఉన్న రెవెన్యూ శాఖ అధికారి కుమార్తెకు ఉద్యోగాన్ని ఇస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తెనాలి డివిజన్ డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సమయంలో బాలాజీసింగ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ పెరాలసిస్ అని చెప్పారు. విధులకు హాజరుకాలేని స్థితిలో ఉన్న బాలాజీసింగ్ పరిస్థితిని రెవెన్యూ ఉద్యోగుల జిల్లా సంక్షేమ సంఘ సభ్యులు, మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డ్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, తెనాలి సబ్ కలెక్టర్, తహసీల్దార్ గుర్తించారు. బాలాజీసింగ్ కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వచ్చనే నిర్ణయానికి వచ్చి, ఆ మేరకు బాధితుడి రెండో కుమార్తె అనూహ్యకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను ఆమెకు తహసీల్దార్ కె.రవిబాబు బుధవారం అందజేశారు.

మోదీని గద్దె దించేందుకు 21 పార్టీలు ఏకం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన ముప్పాళ్ల నాగేశ్వరరావు

తెనాలి: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించటానికి దేశంలోని 21 పార్టీలు ఏకమవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. కేంద్రప్రభుత్వం దుష్టచర్యలను వామపక్షాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో జరుగుతున్న రచయితలు, కళాకారుల మూడురోజుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి రామకృష్ణ పాల్గొన్నారు. కళాకారుల కళాప్రదర్శనలను తిలకించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను దుయ్యబట్టారు. 'ఇప్టా' జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, రాష్ట్ర కార్యదర్శి చెన్నం పెంచలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, సీపీఐ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు తదితరులు శిక్షణ తరగతుల్లో మాట్లాడారు.

గుండెపోటుతో న్యాయవాది హఠాన్మరణం



పాముల అంజయ్య (ఫైల్)

తెనాలి: తెనాలి బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది పాముల అంజయ్య (54) బుధవారం ఉదయం హఠాన్మరణం చెందారు. ఉదయం 10.30 గంటలకు ఆయన గుండెపోటు రావటంతో మృతిచెందారు. అంజయ్య స్వగ్రామం దుగ్గిరాల గ్రామ పంచాయతి పరిధిలోని దేవరపల్లి అగ్రహారం. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రవిరాజు, దళితనాయకుడు, న్యాయవాది కేసీ బసవయ్యలు గ్రామానికి వెళ్లి, అంజయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. అంజయ్య భార్య, కుమార్తెకు సానుభూతిని తెలియజేశారు. గురువారం ఉదయం దేవరపల్లి అగ్రహారంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

వైఎస్సార్ జ్ఞాపకార్థం బెంచీలు వితరణ



బెంచీలు అందజేస్తున్న విశ్రాంత చీఫ్ ఇంజినీర్ కొమ్మినేని రామారావు

తాడికొండ: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డిపై అభిమానంతో విశ్రాంత చీఫ్ ఇంజినీర్ 31 బెంచీలను వివిధ ఆలయాలు, పార్కులు, ముఖ్య కూడళ్లలో అందజేశారు. తొలి నుంచి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిపై అభిమానంగా ఉండే తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామానికి చెందిన కొమ్మినేని రామారావు వైఎస్సార్ పేరుతో గతంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది కూడా ఎప్పటి లాగానే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జ్ఞాకార్థం అని బెంచీలపై ముద్రించి తుళ్లూరు మండలంలోని ఆలయాలు ప్రధాన కూడళ్ళతో పాటు తాడికొండలో కూడా బెంచీలను అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు.